RNI. No. TELTEL /2022/ 89348



మన వార్తలు.. మన సమాచారం.. మన విశేషాల మాగాణ.. మన..

# తెలంగాణ అవతరణ

ఆత్మ గౌరవ అక్షర సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

సంపుటి : 4 సంచిక : 138 | పెద్దపల్లి | ఎడిటర్ : పి. రామకృష్ణ | మంగళవారం, మే,19, 2026 | పేజీలు : 8 | వెల : రూ. 5/-

## కేరళలో యూడీఎఫ్ ప్రభుత్వం..

# సీఎంగా సతీశన్ ప్రమాణ స్వీకారం

**- కేరళ నూతన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ నేత వీడీ సతీశన్ ప్రమాణ స్వీకారం**
**- పదేళ్ల విరామం తర్వాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన యూడీఎఫ్ కూటమి**
**- రాజకీయ ప్రత్యర్థిగా భావించే రమేశ్ చెన్నితాలకు హోం శాఖ కేటాయించిన సీఎం**
**- తిరువనంతపురంలో జరిగిన కార్యక్రమానికి రాహుల్ గాంధీ, ఖర్గే హాజరు**



తిరువనంతపురం: కేరళలో పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) తిరిగి అధికార పగ్గాలు చేపట్టింది. నేడు తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత వీడీ సతీశన్ ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ ఆర్లేకర్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సతీశన్‌తో పాటు మరో 20 మంది ఎమ్మెల్యేలు కేబినెట్ మంత్రులుగా ప్రమాణం చేశారు. కొత్త మంత్రివర్గంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు రమేశ్ చెన్నితాల, కే. మురళీధరన్, ఏపీ అనిల్ కుమార్‌లకు స్థానం లభించింది. అలాగే, కేపీసీసీ చీఫ్ సన్నీ జోసెఫ్ కూడా కేబినెట్‌లో చేరారు. మిత్రపక్షాల నుంచి ఐయూఎంఎల్ సీనియర్ నేత పీకే కున్హాలికుట్టి, ఆర్ఎస్పీ నేత షిబు బేబీ జాన్, కేరళ కాంగ్రెస్ నేత మోన్స్ జోసెఫ్, కేరళ కాంగ్రెస్ (జాకబ్) నేత అనూప్ జాకబ్ వంటి ప్రముఖులు మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ వేడుకకు వేలాది మంది యూడీఎఫ్ కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి తమ ఆనందాన్ని పంచుకున్నారు.

రాజకీయ ప్రత్యర్థికి హోంశాఖ.. సతీశన్ సంచలనం: కేరళ రాజకీయాల్లో ఓ అరుదైన పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి వీడీ సతీశన్, అత్యంత కీలకమైన హోం శాఖను తన వద్ద ఉంచుకోకుండా పార్టీలోని తన రాజకీయ ప్రత్యర్థిగా పేరున్న సీనియర్ నేత రమేశ్ చెన్నితాలకు కేటాయించారు. ఇది పార్టీలో అంతర్గత విభేదాలకు ముగింపు పలికి, సమన్వయంతో ముందుకు సాగాలనే సంకేతాలను ఇస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నిర్ణయాన్ని చెన్నితాల ధ్రువీకరించారు. "పదేళ్ల తర్వాత యూడీఎఫ్ అధికారంలోకి వచ్చిన ఈ రోజు కేరళ ప్రజలకు శుభదినం. ప్రజలకు సుపరిపాలన అందించడం మా కర్తవ్యం. నేను హోం శాఖ బాధ్యతలు చేపట్టబోతున్నాను" అని ఆయన తెలిపారు.

## ఇరాన్ వార్ ఎఫెక్ట్

### అమెరికాలో మండిపోతున్న ధరలు..

# ట్రంప్‌కు చిక్కులు



**- ఇరాన్‌తో యుద్ధం కారణంగా అమెరికాలో పెరుగుతున్న ధరలు**
**- ప్రజల ఆర్థిక పరిస్థితి తనకు ముఖ్యం కాదన్న ట్రంప్**
**- ట్రంప్ విధానాలతోనే ఆర్థిక భారం పడుతోందని డెమొక్రాట్ల విమర్శ**
**- దేశ భద్రతే ముఖ్యమని, ఇది తాత్కాలికమేనని రిపబ్లికన్ల వాదన**
**- అమెరికాలో గ్యాలన్ గ్యాస్ ధర 4.51 డాలర్లకు చేరిక**

వాషింగ్టన్: ఇరాన్‌తో కొనసాగుతున్న సైనిక సంక్షోభం అమెరికాలో రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ యుద్ధం కారణంగా ఇంధన ధరలు విపరీతంగా పెరగడంతో, అది అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రిపబ్లికన్ పార్టీకి మధ్యంతర ఎన్నికల ముందు పెద్ద తలనొప్పిగా మారింది. పెరిగిన ధరల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులపై డెమొక్రాట్లు విమర్శలు గుప్పిస్తుండగా, ట్రంప్ సర్కార్ మాత్రం దేశ భద్రతే తమకు ముఖ్యమని వాదిస్తోంది.

అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం, అమెరికాలో గ్యాస్ ధర గ్యాలన్‌కు సగటున 4.51 డాలర్లకు చేరింది. ఇరాన్ సంక్షోభం మొదలైనప్పటి నుంచి అమెరికన్లు ఇంధనంపై అదనంగా 45 బిలియన్ డాలర్లు ఖర్చు చేశారని అంచనా. ఈ విషయంపై డెమొక్రాట్లు తీవ్రంగా స్పందిస్తున్నారు. ట్రంప్ ప్రభుత్వ చర్యల వల్లే డీజిల్, ఎరువులు, గృహ రుణాల వరకు ప్రతీదీ భారంగా మారిందని మాజీ రవాణా మంత్రి పీట్ బట్టిగీగ్ ఆరోపించారు. అయితే, ఈ విమర్శలను ట్రంప్ సర్కార్ తిప్పికొడుతోంది. "ప్రజల ఆర్థిక పరిస్థితి గురించి నేను ఆలోచించడం లేదు. ఇరాన్‌ను అణ్వా యుధం సొంతం చేసుకోనివ్వకూడదన్నదే నా లక్ష్యం" అని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. ట్రంప్ దేశాన్ని అనవసరమైన యుద్ధంలోకి లాగారని డెమొక్రాటిక్ ప్రతినిధి హకీమ్ జెఫ్రీస్ విమర్శించారు. మరోవైపు, దేశ భద్రత ముందు ఈ ఆర్థిక ఇబ్బందులు తాత్కాలికమేనని రిపబ్లికన్లు వాదిస్తున్నారు. ఇరాన్ నుంచి ఎదురయ్యే ముప్పు పెద్దదని, యుద్ధం ముగిసిన వెంటనే ధరలు తగ్గుతాయని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# కెబిర్ పార్క్ చుట్టూ చెట్ల నరికివేతపై స్టే

## సుప్రీం ఆదేశాలతో నిలిచిపోనున్న ప్లై ఓవర్ నిర్మాణాలు



న్యూఢిల్లీ,మే18 :కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చెట్ల నరికివేతపై సుప్రీం కోర్టు స్టే విధించింది. ఎకో సెన్సిటివ్ జోన్ లోపల చెట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ నరకరాదని ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కేబీఆర్ పార్క్ చుట్టూ ప్లై ఓవర్ నిర్మాణాన్ని తెలంగాణ ప్రభుత్వం చేపట్టగా.. చెట్ల నరికివేతపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. సోమవారం జస్టిస్ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం ముందు ఈ పిటిషన్‌పై విచారణ జరిగింది. పర్యావరణ ప్రేమికుల తరఫున సీనియర్ కౌన్సిల్ కె. వివేక్ రెడ్డి బలమైన వాదనలు వినిపించారు. చెట్ల నరికివేత వల్ల వస్తున్న పర్యావరణ నష్టాన్ని వివరించి, ప్రభుత్వ నిర్మాణ పనులపై స్టే విధించాలని కోర్టును కోరారు. దీంతో చెట్ల నరికివేతపై స్టే ఇచ్చిన సుప్రీంకోర్టు.. తదుపరి విచారణను జూలై 27కు వాయిదా వేసింది. సుప్రీంకోర్టు స్టే ఆదేశాలతో ఎస్ఆర్‌డీపీ పనులు తాత్కాలికంగా నిలిచిపోనున్నాయి. ప్రధానంగా కేబీఆర్ జంక్షన్ పరిసరాల్లో ప్లై ఓవర్ల నిర్మాణానికి భారీ ఆటంకం ఏర్పడింది.

## రష్యా నుంచి భారత్

# చమురు కొనుగోళ్ళు..

**అమెరికా ఆంక్షలు ఉన్నా లేకపోయినా రష్యా నుంచి చమురు కొనుగోళ్ళు ఉంటాయని వెల్లడి**
**దేశీయ ప్రయోజనాలకు అనుగుణంగా ముడి చమురు ధరలు ఉంటాయని వెల్లడి**
**ఆంక్షలు అమల్లో ఉన్నప్పుడు కూడా రష్యా నుంచి కొనుగోలు చేశామన్న కేంద్రం**



**న్యూఢిల్లీ,మే 18:**అమెరికా ఆంక్షలు ఉన్నా లేకపోయినా రష్యా నుంచి చమురు కొనుగోళ్ళు కొనసాగుతాయని భారత్ స్పష్టం చేసింది. దేశీయ ఇంధన అవసరాలు, ప్రయోజనాలకు అనుగుణంగా ముడి చమురు దిగుమతులు ఉంటాయని తెలిపింది. రష్యా పెట్రోలియం ఉత్పత్తులపై అమెరికా ఆంక్షల మినహాయింపు గడువు ముగిసిన నేపథ్యంలో కేంద్రం దీనిపై స్పందించింది. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ వెల్లడించారు. రష్యా చమురుపై అమెరికా ఆంక్షలు అమల్లో ఉన్నప్పుడు కూడా భారత్ అక్కడి నుంచి కొనుగోలు చేసిందని తెలిపారు. ఆంక్షలను సడలించినప్పుడూ మాస్కో నుంచి చమురు దిగుమతి చేసుకున్నామని అన్నారు. ఇప్పుడు కూడా ఆ కొనుగోళ్ళు కొనసాగుతాయని తెలిపారు.

చమురు ఏ దేశం నుంచి కొనాలనేది పూర్తిగా మన వాణిజ్య ప్రయోజనాలపై ఆధారపడి ఉంటుందని అన్నారు. అందువల్ల అమెరికా ఆంక్షల సడలింపు ఉన్నా లేకపోయినా మనకు ఇంధన సరఫరాపై ఎలాంటి ప్రభావం ఉండదని స్పష్టం చేసింది. దేశంలో చమురు కొరత లేదని తెలిపారు. ఇరాన్‌తో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, రష్యా చమురు కొనుగోలు చేసేందుకు భారత్ సహా ప్రపంచ దేశాలకు అనుమతిస్తూ అమెరికా ఆంక్షలు సడలించిన విషయం తెలిసిందే. అయితే ఇప్పటికే సముద్రంలో ఉన్న రష్యా చమురు నౌకల నుంచి మాత్రమే ఈ కొనుగోళ్ళు జరపాలని గతంలో తెలిపింది. ఆ గడువు మే 17తో ముగిసిన నేపథ్యంలో దేశంలో చమురు కొరతపై మరోసారి ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో, కేంద్రం స్పందించింది.

# గులాబీ మిషన్ 2028



హైదరాబాద్,: తెలంగాణ రాజకీయాల్లో మరోసారి గులాబీ జెండా రెపరెపలాడించేందుకు బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావుసమర శంఖం పూరించారు. పార్టీ ఓటమి అనంతరం కొంతకాలంస్తబ్దుగా ఉన్న గులాబీ శ్రేణుల్లో నూతనోత్తేజం నింపేందుకు మంగళవారం ఎర్రవెల్లిలోని తన నివాసంలో కేసీఆర్ కీలక భేటీ నిర్వహించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీష్ రావు సహా23మంది ముఖ్య నేతలతో సుదీర్ఘంగా సాగిన ఈసమావే శం, కేవలం ఒక సమీక్షగా కాకుండా, రాబోయే నాలుగేళ్ల ప్రయాణానికి దిక్సూచిగా నిలిచింది.కేసీఆర్ తీసుకున్న అత్యంత కీలక నిర్ణయం డిజిటల్ సభ్యత్వ నమోదు. గతంలో అనుసరించిన సంప్రదాయ సభ్యత్వ పద్ధతులకు స్వస్తి పలికి, పూర్తిస్థాయిలో సాంకేతికతను జోడించి సభ్యత్వాలను నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతి గ్రామంలో బూత్ స్థాయి నుంచి సభ్యుల సమాచారాన్ని డిజిటలైజ్ చేస్తారు.దీనివల్ల క్షేత్రస్థాయి కార్యకర్తకు, పార్టీ అధిష్టానానికి మధ్య మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా సంబంధం ఏర్పడుతుంది. నియోజకవర్గాల వారీగా ప్రత్యేక సమన్వయకర్తలను నియమించి, పార్టీ కార్యకలాపాల్లో పారదర్శకతను పెంచనున్నారు.రాష్ట్రంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో జరుగుతున్న జాప్యాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కేసీఆర్ నేతలకు దిశానిర్దేశం చేశారు. రైతు రుణమాఫీలో జాప్యం, ధరణి పోర్టల్ సమస్యలు, నిరుద్యోగ భృతి వంటి హామీల వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. గతంలో నిర్వహించిన భారీ బహిరంగ సభల కంటే, ఈసారి ప్రజలతో నేరుగా మమేకమయ్యేలా 'జన చైతన్య యాత్రల'కు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. గ్రామాల వారీగా తిరుగుతూ, ప్రజల సమస్యలపై పోరాడటం ద్వారానే పూర్వ వైభవం సాధ్యమవుతుందని కేసీఆర్ స్పష్టం చేశారు.పదేళ్ల అధికార కాలంలో నాయకులకు, సాధారణ కార్యకర్తలకు మధ్య ఏర్పడిన దూరాన్ని గుర్తించిన కేసీఆర్, పార్టీ నిర్మాణంలో భారీ మార్పులు సూచించారు. కేవలం నాయకుల చుట్టూ తిరిగే పార్టీగా కాకుండా, క్షేత్రస్థాయి కార్యకర్తలే నిర్ణయాత్మక శక్తిగా ఉండేలా క్యాడర్ డ్రివెన్ వ్యవస్థగా బీఆర్ఎస్ రూపాంతరం చెందబోతోంది. ప్రతి కార్యకర్తకు రాజకీయ భద్రత కల్పించడంతో పాటు, కష్టకాలంలో పార్టీ కుటుంబంలా అండగా ఉంటుందనే భరోసా ఇచ్చేలా సంస్థాగత రక్షణ వ్యవస్థను బలోపేతం చేయనున్నారు. బీఆర్ఎస్ పునర్నిర్మాణం కేవలం కమిటీల మార్పుకే పరిమితం కాదని, తెలంగాణ అస్తిత్వాన్ని, అభివృద్ధిని మళ్లీ చర్చలోకి తెచ్చే ప్రయత్నమని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. 'రీక్లెయిమింగ్ తెలంగాణ' అనే నినాదంతో, తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా బీఆర్ఎస్‌ను మళ్ళీ నిలబెట్టాలని కేసీఆర్ సంకల్పించారు.మొత్తంగా, ఎర్రవెల్లి భేటీ బీఆర్ఎస్ పార్టీలో నిస్తేజాన్ని వదిలించుకుని ఒక శక్తివంతమైన ప్రతిపక్షంగా అసెంబ్లీలోనూ, వీధుల్లోనూ పోరాడేందుకు అవసరమైన పక్కా యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. రాబోయే రెండేళ్ల కాలానికి కేసీఆర్ నిర్దేశించిన ఈ రోడ్ మ్యాప్ తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి.

## ఆలయ పూజారుల జీతాలపై పిల్..

# విచారణకు సుప్రీంకోర్టు నో

**- ప్రభుత్వ నియంత్రణలోని ఆలయ పూజారుల జీతభత్యాలపై దాఖలైన పిల్ తిరస్కరణ-ఈ విషయంలో జోక్యం చేసుకోలేమన్న సుప్రీంకోర్టు ధర్మాసనం- సంబంధిత అధికారులను ఆశ్రయించేందుకు పిటిషనర్‌కు స్వేచ్ఛనిస్తూ అనుమతి-పూజారులను ఉద్యోగులుగా గుర్తించాలని పిటిషన్‌లో అభ్యర్థన**

**న్యూఢిల్లీ,మే 18:**దేశవ్యాప్తంగా ప్రభుత్వ నియంత్రణలో ఉన్న ఆలయాల్లో పనిచేస్తున్న పూజారులు, సేవాదార్లు, ఇతర సిబ్బందికి ఏకరీతి వేతనాలు, సంక్షేమ ప్రణాళికను రూపొందించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ విషయంలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే... న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ్ ఈ పిల్ దాఖలు చేశారు. ప్రభుత్వ ఆధీనంలోని ఆలయాల్లో పనిచేస్తున్న పూజారులు, సిబ్బంది వేతనాలు, సేవా నిబంధనలను సమీక్షించేందుకు జ్యుడీషియల్ కమిషన్ లేదా నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన తన పిటిషన్‌లో కోరారు. వేతనాల కోడ్ 2019లోని సెక్షన్ 2(కే) ప్రకారం పూజారులను, ఆలయ సిబ్బందిని 'ఉద్యోగులు'గా గుర్తించి, వారికి కనీస వేతనం, ఇతర కార్మిక సంక్షేమ రక్షణలు కల్పించాలని అభ్యర్థించారు. ప్రభుత్వాలు ఆలయాలపై పరిపాలన, ఆర్థిక నియంత్రణ చేపట్టినప్పుడు ప్రభుత్వానికి పూజారుల మధ్య యజమాని–ఉద్యోగి సంబంధం ఏర్పడుతుందని పిటిషనర్ వాదించారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి రాష్ట్రాల్లో పూజారులు, సిబ్బంది కేవలం రూ. 1,000 నుంచి రూ. 5,000



మధ్య ఉన్న నామమాత్రపు గౌరవ వేతనాలు, దక్షిణలపై ఆధారపడి జీవిస్తున్నారని, వారికి పెన్షన్, ఆరోగ్య సంరక్షణ వంటి సామాజిక భద్రత కూడా లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# సంపాదకీయం

## డాలర్‌ను సవాలు చేస్తే అంతేనా..?

వెనెజువెలా అధ్యక్షుడు నికొలస్ మదురోను బంధించి సంకెళ్లతో తీసుకెళ్లడం





చూస్తుంటే సరిగ్గా 22- 23 ఏళ్ళ క్రితం ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుసేన్‌పై దాడి చేసి, ఆ తర్వాత ఉరితీసిన అమెరికా దుశ్చర్య గుర్తుకు వస్తుంది. సద్దాం జీవాయుధాలు తయారు చేస్తున్నాడనే ఆరోపణతో యుద్ధానికి దిగిన అమెరికా అందుకు ఎటువంటి ఆనవాళ్లను ఇప్పటివరకు చూపలేకపోయింది. ఇప్పుడు కూడా అమెరికా వెనెజువెలాపై దాడిచేయడానికి అసలు కారణం 1974లో సౌదీఅరేబియాతో హెన్రీ కిస్సింజర్ చేసుకున్న ఒప్పందం. ఇది వాస్తవానికి అమెరికా డాలర్ మనుగడ గురించి అని మాత్రం స్పష్టం అవుతుంది. ట్రంప్ చెబుతున్నట్లు మాదకద్రవ్యాలు, ఉగ్రవాదం, ప్రజాస్వామ్యం వంటి కారణాలు ఏవీకావు. ఇది 50 సంవత్సరాలుగా అమెరికాను ఆధిపత్య ఆర్థికశక్తిగా ఉంచిన పెట్రోడాలర్ వ్యవస్థను కాపాడుకోవడం కోసమే అని గ్రహించాలి. వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన డెల్సీ రోడ్రిగ్జ్‌ను కూడా తమ మాట వినకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడం గమనార్హం. అమెరికా బెదిరించి, బలప్రయోగం చేసి డాలర్లతో అంతర్జాతీయ వాణజ్యం జరిగేటట్లు చూస్తూ ప్రపంచంలో సంపన్న దేశంగా చెలామణి అవుతుంది. ఎప్పుడైతే యూరోలో చమురు వాణజ్యం చేస్తానని సద్దాం ప్రకటించారో తన ఆర్థిక వ్యవస్థ కూలిపోతుందని అమెరికా భయపడింది. ఇపుడు కూడా మదురో ఇతర కరెన్సీలలో చమురు వాణిజ్యం చేయడం ప్రారంభించింది అమెరికా భయపడిపోయింది. అందుకనే వెనిజులాను అంతం చేస్తామని ట్రంప్ బెదిరించారు.వెనిజులాలో 303 బిలియన్ బారెల్స్ నిరూపితమైన చమురు నిల్వలు ఉన్నాయి. సౌదీ అరేబియా కంటే ఎక్కువ. మొత్తం ప్రపంచ చమురులో 20 శాతం. వెనెజువెలా ఆ చమురును చైనీస్ యువాన్‌లో చురుకుగా అమ్ముతోంది. డాలర్లలో కాదు. 2018లో వెనెజువెలా డాలర్ నుండి విముక్తి పొందుతామని ప్రకటించింది. వారు యువాన్, యూరోలు, రూబిళ్లు, చమురుకు డాలర్లు తప్ప మరేదైనా అంగీకరించడం ప్రారంభించారు. పైగా, బ్రిక్స్‌లో సభ్యతం కోసం దరఖాస్తుకు సిద్ధమయ్యారు. స్విఫ్ట్‌ను పూర్తిగా దాటవేస్తూ చైనాతో ప్రత్యక్ష చెల్లింపు మార్గాలను నిర్మిస్తున్నారు. వారు దశాబ్దాలుగా డాలర్ ఆధిపత్యం తొలగించేందుకు అవసరమైన నిధులు సమకూర్చడానికి తగినంత చమురు నిల్వలు వారి వద్ద ఉన్నాయి. మొత్తం అమెరికన్ ఆర్థిక వ్యవస్థ పెట్రోడాలర్ పై నిర్మించారని గుర్తించాలి. చమురు వ్యాపారం డాలర్లతో జరగకపోతే అమెరికా ఆర్థిక వ్యవస్థ కూలిపోతుంది. అందుకనే, 1974లో, హెన్రీ కిస్సింజర్ సౌదీ అరేబియాతో ఒక ఒప్పందం కుదుర్చుకున్నాడు. ప్రపంచవ్యాప్తంగా అమ్మోడైన అన్ని చమురు ధరలను అమెరికా డాలర్లలో నిర్ణయించే విధంగా అవగాహనకు వచ్చారు. అందుకు బదులుగా, అమెరికా ఆ దేశానికి సైనిక రక్షణను అందిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా డాలర్లకు కృత్రిమ డిమాండ్‌ను సృష్టించింది. భూమిపై ఉన్న ప్రతి దేశానికి చమురు కొనడానికి డాలర్లు అవసరం. ఇది అమెరికా అపరిమిత డబ్బును ముద్రించడానికి అనుమతిస్తుంది. ఆ నిధులతోనే సైన్యానికి నిధులు సమకూరుస్తుంది. సంక్షేమ రాజ్యం. లోటు వ్యయం. పెట్రోడాలర్ సైనిక విమానాలకంటే అమెరికా ఆధిపత్యానికి చాలా ముఖ్యంగా మారింది. అందుకనే దానిని సవాలు చేసే నేతలను అమెరికా సహింపలేదు. 2000లో సద్దాం హుస్సేన్ ఇరాక్ డాలర్లకు బదులుగా యూరోలలో చమురును విక్రయిస్తుందని ప్రకటించాడు. 2003 నాటికి అమెరికా ఆ దేశాన్ని ఆక్రమించుకుంది.ఇరాక్ చమురు వెంటనే డాలర్లకు తిరిగి మారింది. సద్దాంను కొట్టి చంపారు. 2009లో చమురు వ్యాపారం కోసం గడాఫీ గోల్ దినార్ అని పిలువబడే బంగారు మద్దతుగల ఆఫ్రికన్ కరెన్సీని ప్రతిపాదించాడు. హిల్లరీ క్లింటన్ స్వయంగా లీక్ అయిన ఇ మెయిల్‌లు జోక్యానికి ఇది ప్రధాన కారణమని నిర్ధారిస్తాయి. ఇ మెయిల్‌లో ఈ బంగారం లిబియా బంగారు దినార్ ఆధారంగా పాన్ -ఆఫ్రికన్ కరెన్సీని స్థాపించడానికి ఉద్దేశించబడింది. 2011లో నాటో లిబియాపై బాంబులు వేసింది. గడాఫీని లైంగికంగా హింసించి హత్యచేశారు. లిబియాలో ఇప్పుడు బానిసమార్కెట్లు తెరిచిఉన్నాయి.మేము వచ్చాము, మేము చూశాము, అతను చనిపోయాడు! క్లింటన్ కెమెరా ముందు నవ్వాడు. బంగారు దినార్ అతనితోపాటు మరణించింది. ఇప్పుడు మదురో. సద్దాం, గడాఫీలు ఇద్దరి వద్ద కంటే ఐదురెట్లు ఎక్కువ చమురుతో యువాన్‌లో చురుకుగా అమ్ముతున్నారు. డాలర్ నియంత్రణ వెలుపల చెల్లింపు వ్యవస్థలను నిర్మించడంతోపాటు బ్రిక్స్‌లో చేరాలని దరఖాస్తు చేసుకున్నాడు. డాలర్ ఆధిపత్యాన్ని కట్టడి చేసేందుకు నాయకత్వం వహిస్తున్న చైనా, రష్యా, ఇరాన్‌లతో భాగస్వామ్యం ఏర్పరచుకున్నాడు. ఇది యాదృచ్ఛికం కాదు. పెట్రోడాలర్‌ను ఎవ్వరు సవాల్ చేసినా వారు సమాధి కావాల్సిందే. రెండు వారాల క్రితం బిగ్గరగా ఇలా అన్నారు: అమెరికన్ చెమట, చాతుర్యం, శ్రమ వెనిజులాలో చమురు పరిశ్రమను సృష్టించాయి. దాని నిరంకుశ దోపిడీ అమెరికన్ సంపద, ఆస్తిపై నమోదైన అతిపెద్ద దొంగతనం. వెనిజులా చమురు అమెరికాకు చెందిందని నిస్సిగ్గుగా బహిరంగంగా చెబుతున్నారు. ఎందుకంటే అమెరికా కంపెనీలు దీనిని 100 సంవత్సరాల క్రితం అభివృద్ధి చేశాయి. ఈ తర్కం ప్రకారం, చరిత్రలో ప్రతి జాతీయం చేసిన వనరు దొంగతనం. కానీ ఇక్కడ లోతైన సమస్య ఉంది. పెట్రోడాలర్ ఇప్పటికే చనిపోతోంది. రష్యాఉక్రెయిన్ నుండి రూబిళ్లు, యువాన్లలో చమురును విక్రయిస్తుంది. సౌదీ అరేబియా బహిరంగంగా యువాన్ సెటిల్మెంట్ల గురించి చర్చిస్తుంది. ఇరాన్ సంవత్సరాలుగా నాన్-డాలర్ కరెన్సీలలో వ్యాపారం చేస్తోంది. చైనా 185 దేశాలలో 4,800 బ్యాంకులతో స్విఫ్ట్‌కు తమ స్వంత ప్రత్యామ్నాయమైన సిప్స్‌ని నిర్మించింది. బ్రిక్స్ డాలర్‌ను పూర్తిగా దాటవేసే చెల్లింపు వ్యవస్థలను చురుకుగా నిర్మిస్తోంది. ఎంబ్రిడ్జ్ ప్రాజెక్ట్ కేంద్ర బ్యాంకులు స్థానిక కరెన్సీలలో తక్షణమే లావాదేవీలను పరిష్కరించడానికి అనుమతిస్తుంది. 303 బిలియన్ బ్యారెల్ల చమురుతో వెనిజులా బ్రిక్స్‌లో చేరడం వల్ల ఇది విపరీతంగా వేగవంతం అవుతుంది ప్రస్తుతం అమెరికా సైనిక దాడి కేవలం డాలర్ అస్తిత్వానికి ఎదురవుతున్న ఈ ప్రమాదం కారణంగానే జరిగిందని స్పష్టం అవుతుంది. మాదకద్రవ్యాలను ఆపకపోవడం అన్నది కేవలం ఓ సాకు మాత్రమే. వెనెజువెలా అమెరికా కొకైన్‌లో 1 శాతం కంటే తక్కువ వాటా కలిగి ఉంది. పైగా, మదురో ఉగ్రవాద సంస్థను నడుపుతున్నాడని ఎటువంటి ఆధారాలు లేవు. ఎన్నికలు లేని సౌదీ అరేబియాకు మద్దతు ఇస్తున్న అమెరికా ప్రజాస్వామికంగా ఎన్నికైన మదురోను కూల్చడం వెనుక ఆర్థిక ప్రయోజనాలే బలీయంగా ఉన్నాయని స్పష్టం అవుతుంది. అయితే చరిత్ర గతి ఎప్పుడూ ఒకే విధంగా ఉండబోదని అమెరికా గ్రహించాలి. అంతర్జాతీయంగా నానాటికీ అమెరికా ఒంటరి అవుతూ ఉండగా, సరికొత్త సమీకరణాలు ఏర్పడుతున్నాయి. ఐరోపా యూనియన్ సైతం అమెరికా ఉనికి చూసి నేడు అప్రమత్తం అయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. బ్రిక్స్ సమీకరణాలు ఒకవైపు, చైనా,- రష్యా మరోవైపు బలమైన ప్రతిఘటన ఇచ్చేందుకు సిద్ధపడుతోంది

# పెళ్లి రోజున మహోన్నత నిర్ణయం

**- మరణానంతరం నేత్ర, అవయవ దానానికి దంపతుల అంగీకారం-**

**సమాజానికి ఆదర్శంగా నిలిచిన ఉపాధ్యాయ దంపతులు**





(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని)పెళ్లి రోజు వేడుకలను కేవలం ఆనందాలకు మాత్రమే పరిమితం చేయకుండా, సమాజానికి ఉపయోగపడే విధంగా జరుపుకోవాలని సంకల్పించిన ఓ ఉపాధ్యాయ దంపతులు స్ఫూర్తిదాయక నిర్ణయం తీసుకున్నారు. గోదావరిఖని పద్మావతి కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు దాసరి రఘుగౌడ్ -- స్వర్ణలత దంపతులు తమ మరణానంతరం నేత్రాలు, అవయవాలు దానం చేస్తామని ప్రకటించి పలువురి ప్రశంసలు అందుకున్నారు. సోమవారం రాత్రి వారి నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో నేత్ర, అవయవ దానానికి సంబంధించిన అంగీకార పత్రాలపై సంతకాలు చేసి సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రచార కార్యదర్శి కే.ఎస్. వాసుకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా జర్నలిస్ట్ సంఘం ఎథిక్స్ కమిటీ కో-కన్వీనర్ పందిళ్ళ శ్యామ్‌సుందర్ చేతుల మీదుగా దంపతులను శాలువాతో సత్కరించి అభినందన పత్రం అందించారు. ఈ సందర్భంగా శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ... "మరణానంతరం కూడా పలువురికి కొత్త జీవితం అందించాలనే ఆలోచన గొప్ప మానవతా దృక్పథానికి నిదర్శనం. ఇలాంటి నిర్ణయాలు మరెందరికో ప్రేరణగా నిలుస్తాయి" అని అన్నారు. సదాశయ ఫౌండేషన్ ప్రచార కార్యదర్శి కే.ఎస్. వాసు, జిల్లా గౌరవ సలహాదారు తడబోయిన రాములు మాట్లాడుతూ... ఉపాధ్యాయ వృత్తిలోనే కాకుండా సామాజిక సేవలోనూ ముందుండే రఘుగౌడ్ దంపతులు, తమ పెళ్లి రోజున అవయవ దానం ప్రకటించడం అభినందనీయమన్నారు. సమాజ హితం కోసం ముందుకు వచ్చే ఇలాంటి కుటుంబాలు యువతకు ఆదర్శమని కొనియాడారు. కార్యక్రమంలో దంపతుల కుమారుడు సాయి నవనీత్, కుమార్తె హర్షిక, మామయ్య మోత్కూరి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## జి.డి.కే 1అండ్3 ఇంక్లైన్ లో
# మల్టి డిపార్ట్ మెంటల్ సమావేశం



తెలంగాణ అవతరణ, గోదావరిఖని, మే 18:ఆర్జీ-1 పరిధిలోని జి.డీ.కే 1 అండ్ 3 ఇంక్లైన్ లో సోమవారం "మల్టి డిపార్ట్ మెంటల్" సమావేశం గ్రుఫ్ ఏజంట్ యల్ రమేష్ అధ్యక్షతన జరిగింది. మన సంస్థ, మన గని, మన బాధ్యతలను వివరించే మల్టీ డిపార్మెంట్ సమావేశం మొదటి బదిలీ, రెండవ బదిలీలలో నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా ఎజియం (ఐఈడి) ఆంజనేయులు, వక్తలు మాట్లాడుతూ... మన సంస్థ, మన గని, మన బాధ్యతలను వివరించే ఇట్టి "మల్టి డిపార్ట్ మెంటల్ సమావేశంలో వివిధ అంశాల గురించి కమిటి సభ్యులు తెలియజెస్తూ సంస్థ పురోభివృద్ధికి సాధించవలసిన అంశాల గురించి తెలియజేశారు. ఉత్పత్తి, ఉత్పాదకత పెంచుకోవడం కొరకు గనిలో పని చేస్తున్న వివధ విభాగాల వారిగా ఒక సమిష్టిగా ఏర్పడి సమాలోచనలు జరిపి వాటిని అమలు చేయుటకు సలహాలు సూచనలు పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఇట్టి సమిష్టి నిర్ణయాల వలన ఉత్పత్తి, ఉత్పదకతలు పెంచుటకు అవకాశం లభిస్తుందని తెలిపారు. మల్టి డిపార్మెంట్ కమిటీ సభ్యులు వివిధ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగరేణి లోని గనులు వాటి పని తీరు గురించి బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, బొగ్గు రవాణా, నెలల వారిగా నిర్ధేశించిన బొగ్గు ఉత్పత్తి, రవాణా సాదించుటకు ప్రణాళికల గురించి వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరం ఆర్.జి 1 ఏరియాకు నిర్ధేశించిన ఉత్పత్తి పెంపునకు తీసుకోవలసిన ప్రణాళికల గురించి వివరించారు. అనంతరం ఉద్యోగులచే రక్షణ ప్రతిజ్ఞ చేయించడము జరిగినది. ఈ కార్యక్రమంలో ఏ.ఐ.టి.యు.సి గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రటరీ రంగు శ్రీను, ఎజియం(ఐఈడి) ఆంజనేయులు, ఏరియా ఇంజనీరురామమోహన రావు, ఏజంట్ యల్ రమేష్, యస్.ఓ.యం క్వాలిటి బ్రహ్మజీ, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, గని మేనేజర్ సుదీర్ జక్కుల్ వార్, యస్.ఇ సి.హెచ్ రాజన్న, ఫిట్ సెక్రటరి మానాల శ్రీనివాస్, సంక్షేమాదికారి నిహాల్ సాయి, కమిటి సభ్యులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# కోల్ బెల్ట్ పై నిప్పుల వర్షం

**- సుర సుర సూర్యుడు - సల సల జనం**

**- ఉదయం 9 గంటలకే రోడ్లన్నీ ఖాళీ - ఓసీ బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం**

**- కులర్లకు, ఏసిలకు ఆంటిపెట్టుకుని ఉంటున్న ప్రజలు - ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి**



తెలంగాణ అవతరణ, గోదావరిఖని, మే 18:కోల్ బెల్ట్ పారిశ్రామిక ప్రాంతంపై నిప్పుల వర్షం కురుస్తుంది. రవి కోపోద్రోపానికి ఇక్కడి ప్రజలు తట్టుకోలేక పోతున్నారు. ఎన్నడూ లేనంత ఎండ కొడుతోంది. అధికారికంగా 43 నుంచి 44 డిగ్రీలు ఉందని ప్రకటిస్తున్నప్పటికి వాస్తవ పరిస్థితులు దానికి భిన్నంగా ఉన్నాయి. ఇక్కడి కొన్ని ప్రాంతాల్లో 50 డిగ్రీలు నమోదవుతుందని అనదికారంగా తెలుస్తుంది. ఇక కోల్ మైన్స్ ప్రాంతాల్లో 50 డిగ్రీల కంటే ఎక్కువగానే నమోదవుతుంది. దీంతో పగటి పూట డ్యూటీ చేసే కార్మికులు డ్యూటీలకు రావడానికి జంకుతున్నారు. ఇది బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం చూపుతుంది. ఇదిలావుండగా సూర్యుడు సుర సుర మండడంతో జనం సల సల కాగుతున్నారు. ఉదయం 9 గంటలకే ప్రజలు ఇళ్లల్లోకి చేరుతున్నారు. ఉక్క పోతకు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. 7 కాందే ఎవరు బయటకు రావడం లేదు. రోడ్లన్నీ నిర్మానుషంగా మారుతున్నాయి. కూలర్లు, ఏసీలకు ఆంటిపెట్టుకుని ఉంటున్నారు. వందలాది మంది వడదెబ్బకు గురవుతున్నారు. అయితే కోల్ బెల్ట్ ప్రాంతంలో పెరిగిపోతున్న కాలుష్యంతోనే ఎండ వేడి పెరిగిపోతుంది. ఇక్కడి పరిశ్రమలు లక్షలాది మొక్కలు నాటుతున్నామని ప్రకటనలు గుప్పిస్తున్నప్పటికీ వాటి నిర్వహణలో శ్రద్ధ వహించడం లేదనే ఆరోపణలు బలంగా వినవస్తున్నాయి. ఈ గ్రీన్ హౌస్ ఎఫెక్ట్ ఇదే విదంగా కొనసాగితే యేటేటా ఉష్ణోగ్రతలు పెరిగి వేసవిలో జనం ఓ మూడు మసాలపాటు వలసలు పోవడం ఖాయం అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఇప్పటికైనా ఇక్కడి పరిశ్రమలు మొక్కలు నాటడంలో చూపించే శ్రద్ధ వాటిని పరిరక్షిండంపై చూపాలి. అప్పుడే కొంతలో కొంతైనా కాలుష్యం తగ్గి ఉష్ణోగ్రతలు నిలకడగా ఉండడానికి అవకాశం ఉంది.

## మరో అండర్‌పాస్..!

నెల్లూరు: ఏపీలో మరో అండర్‌పాస్ నిర్మాణం దిశగా కీలక ముందడుగు పడింది. నెల్లూరులో కీలకమైన అండర్‌పాస్ నిర్మాణానికి భూసేకరణ చేపట్టారు. ఇప్పటికే ఈ అండర్‌పాస్ నిర్మాణం కోసం రూ.115 కోట్లు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. అయితే అధికారులు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి అన్ని కుదిరితే ఏప్రిల్ నెలలో పనులు ప్రారంభించాలని భావిస్తున్నారు. నెల్లూరుకు ఈ అండర్‌పాస్ కీలకంగా మారనుంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రం సాయంతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాల్ని వేగవంతం చేసింది. రోడ్లు, రైల్వే లైన్లు, ఫ్లై ఓవర్లు, ఆర్వోబీలు, అండర్‌పాస్‌లు.. ఇలా ఎన్నో పనులు చేపడుతోంది. తాజాగా నెల్లూరు దగ్గర రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్ పెడుతూ అండర్ పాస్ నిర్మాణానికి సిద్ధమైంది.

## జి.డి.కే 1అండ్3 ఇంక్లైన్ లో మల్టి డిపార్ట్ మెంటల్ సమావేశం



తెలంగాణ అవతరణ, గోదావరిఖని, మే 18:ఆర్జీ-1 పరిధిలోని జి.డీ.కే 1 అండ్ 3 ఇంక్లైన్ లో సోమవారం "మల్టి డిపార్ట్ మెంటల్" సమావేశం గ్రుఫ్ ఏజంట్ యల్ రమేష్ అధ్యక్షతన జరిగింది. మన సంస్థ, మన గని, మన బాధ్యతలను వివరించే మల్టీ డిపార్మెంట్ సమావేశం మొదటి బదిలీ, రెండవ బదిలీలలో నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా ఎజియం (ఐఈడి) ఆంజనేయులు, వక్తలు మాట్లాడుతూ... మన సంస్థ, మన గని, మన బాధ్యతలను వివరించే ఇట్టి "మల్టి డిపార్ట్ మెంటల్ సమావేశంలో వివిధ అంశాల గురించి కమిటి సభ్యులు తెలియజెస్తూ సంస్థ పురోభివృద్ధికి సాధించవలసిన అంశాల గురించి తెలియజేశారు. ఉత్పత్తి, ఉత్పాదకత పెంచుకోవడం కొరకు గనిలో పని చేస్తున్న వివధ విభాగాల వారిగా ఒక సమిష్టిగా ఏర్పడి సమాలోచనలు జరిపి వాటిని అమలు చేయుటకు సలహాలు సూచనలు పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఇట్టి సమిష్టి నిర్ణయాల వలన ఉత్పత్తి, ఉత్పదకతలు పెంచుటకు అవకాశం లభిస్తుందని తెలిపారు. మల్టి డిపార్మెంట్ కమిటీ సభ్యులు వివిధ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగరేణి లోని గనులు వాటి పని తీరు గురించి బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, బొగ్గు రవాణా, నెలల వారిగా నిర్ధేశించిన బొగ్గు ఉత్పత్తి, రవాణా సాదించుటకు ప్రణాళికల గురించి వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరం ఆర్.జి 1 ఏరియాకు నిర్ధేశించిన ఉ త్పత్తి పెంపునకు తీసుకోవలసిన ప్రణాళికల గురించి వివరించారు. అనంతరం ఉద్యోగులచే రక్షణ ప్రతిజ్ఞ చేయించడము జరిగినది. ఈ కార్యక్రమంలో ఏ.ఐ.టి.యు.సి గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రటరీ రంగు శ్రీను, ఎజియం(ఐఈడి) ఆంజనేయులు, ఏరియా ఇంజనీరురామమోహన రావు, ఏజంట్ యల్ రమేష్, యస్.ఓ.యం క్వాలిటి బ్రహ్మజీ, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, గని మేనేజర్ సుదీర్ జక్కుల్ వార్, యస్.ఇ సి.హెచ్ రాజన్న, ఫిట్ సెక్రటరి మానాల శ్రీనివాస్, సంక్షేమాదికారి నిహాల్ సాయి, కమిటి సభ్యులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలి - ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



తెలంగాణ అవతరణ, గోదావరిఖని, మే 18:ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని రామగుండం ఎమ్మెల్యే రాజ్ టాకూర్ అన్నారు. ఆదివారం రామగుండం నియోజకవర్గం క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన పాలకుర్తి, అంతర్గం మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో జనగణన కార్యక్రమం, పార్టీ బలోపేతం, గ్రామ స్థాయి కార్యకలాపాలు మరియు ప్రజా సమస్యల పరిష్కారంపై విస్తృతంగా చర్చించారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.ప్రజలకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికి తీసుకెళ్లాలని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాబోయే కార్యక్రమాలలో అందరూ ఐక్యంగా పాల్గొని పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేద రోగులకు రోబోటిక్ విధానంలో ఫ్రీగా సర్జరీలు

హైదరాబాద్: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న పేద రోగులకు ఎంఎన్‌జే ఆసుపత్రిలో ఉచితంగా సర్జరీలు చేస్తున్నారు. రోబోటిక్ విధానంలో రోగులకు ఆరోగ్యశ్రీ పథకం కింద శస్త్రచికిత్సలు చేస్తున్నారు. గత రెండున్నరేళ్లలో ఆసుపత్రిలో రూ.12.5 కోట్ల విలువైన సర్జరీలు చేసినట్లు వైద్యులు వెల్లడించారు.పేద రోగులకు నిజంగా ఇది వరమనే చెప్పాలి. హైదరాబాద్ నగరంలోని ప్రభుత్వ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో పేద రోగులకు రోబోటిక్ విధానంలో అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్నారు. అవి కూడా ఉచితంగా. గడిచిన 30 నెలల వ్యవధిలో దాదాపు రూ.12.5 కోట్ల విలువైన రోబోటిక్ సర్జరీలు విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సేవలను ఆరోగ్యశ్రీ కింద పూర్తి ఉచితంగా పేద రోగులకు అందిస్తున్నారు.



# 5 వేల కోట్ల కోసం 42 ఎకరాల భూమి అమ్మకం



హైదరాబాద్: హైదరాబాద్‌లో మరోసారి భూములు వేలం వేయడానికి తెలంగాణ ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. మూసాపేట, బంజారాహిల్స్, కొండాపూర్‌లో మొత్తం 42 ఎకరాలను వేలం వేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీని ద్వారా సుమారు రూ. 5 వేల కోట్లు సేకరించాలని టార్గెట్‌గా పెట్టుకుంది. దీనికి సంబంధించి హెచ్‌ఎండీఏ ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. అయితే గతంలో హైదరాబాద్‌లో జరిగిన భూముల వేలాల్లో రికార్డు ధరలు పలికాయి. దీంతో ఈసారి కూడా భారీ స్పందన వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో మరోసారి భూములు వేలం వేయడానికి సిద్ధమవుతోంది. మొత్తం 42 ఎకరాల భూమి వేలం వేయాలని నిర్ణయించింది. దీని ద్వారా దాదాపు రూ. 5 వేల కోట్లు సేకరించాలని టార్గెట్‌గా పెట్టుకుంది. కాగా, భాగ్యనగరంలో భూములు వేలం వేసిన ప్రతిసారి రికార్డు ధరలు పలుకుతున్నాయి. ఇటీవల కోకాపేటలో ఎకరం రూ. 151 కోట్లు పలికింది. అంతకుముందు రాయదుర్గంలో జరిగిన వేలంలో ఎకరం ఏకంగా రూ. 177 కోట్లు పలికి రికార్డు సృష్టించింది. ఈ తరుణంలో త్వరలో జరగబోయే వేలంలో ఎకరం ఎంత పలుకుతుంది అనేది ఆసక్తిగా మారింది.మూసాపేటలో 14 ఎకరాలు, బంజారాహిల్స్‌లో 8.37 ఎకరాలు, కొండాపూర్‌లో 20 ఎకరాల వేలం వేయడానికి హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) కసరత్తు చేస్తోంది. దాదాపు రెండు నెలల క్రితం కోకాపేటలో భూములు వేలం వేసినప్పుడే.. మూసాపేటలో భూములను కూడా విక్రయించాలనిలని ప్రభుత్వం భావించింది. అయితే భూములు వేలం వేయొద్దంటూ స్థానికులు, ప్రజాప్రతినిధుల నుంచి వ్యతిరేకత రావడం వల్ల.. ప్రభుత్వం వెనక్కి తగ్గింది. కాగా, ఆ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, రాత్రికి రాత్రే నిర్మాణాలు చేపడుతున్నారని అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడంతో మరోసారి ఈ భూముల వేలం మరోసారి తెరపైకి వచ్చింది. ఆ నివేదికను పరిశీలించిన ప్రభుత్వం.. స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చలు జరిపి భూములను వేలం వేసేందుకు ఆమోదం తెలిపింది.బంజారా హిల్స్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సుమారు 15 ఎకరాల వరకు ఉన్న భూమి.. చాలా వరకు కబ్జాకు గురైంది. ప్రభుత్వ స్థలంలోకి నిర్మాణాలు చొచ్చుకొచ్చాయి.

దీంతో కొండ ప్రాంతాన్ని పక్కకు పెట్టి.. 8.37 ఎకరాలను విక్రయించాలని ప్రభుత్వం భావించింది. కొండాపూర్‌లో 20 ఎకరాలు, మూసాపేటలోని 14 ఎకరాలు కలిపి మొత్తం 42 ఎకరాలను ఆన్‌లైన్‌లో వేలం వేసేందుకు హెచ్‌ఎండీఏ కసరత్తు చేస్తోంది.మరోవైపు, హైదరాబాద్ ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధి చెందుతోంది. భారత్‌లోని టాప్ నగరాలతో పోటీ పడుతూ అత్యంత నివాసయోగ్యమైన ప్రాంతంగా గుర్తింపు పొందుతోంది.

మౌలిక సదుపాయాలు, మానవవనరులు పుష్కలంగా ఉండటంతో.. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన సంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యాలయాలను ప్రారంభించడానికి ఆసక్తి చూపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారీ నిర్మాణ ప్రాజెక్టులు చేపట్టాలనుకునే సంస్థలకు భూములు దొరకడం కష్టంగా మారింది. ప్రైవేటు స్థలాలు వివిధ ప్రాంతాల్లో ఉన్నా.. విక్రయించడానికి యజమానులు ముందుకు రావడం లేదు. ఈ నేపథ్యంలో గతంలో టీజీఐఐసీ, హెచ్‌ఎండీఏలు వేలం వేసిన భూములకు మంచి రెస్పాన్స్ వచ్చింది. మూసాపేట, బంజారాహిల్స్, కొండాపూర్‌లో కూడా అలాంటి రెస్పాన్స్ వచ్చి.. రూ. 5 వేల కోట్ల టార్గెట్ చేరుకుంటామని ప్రభుత్వం భావిస్తోంది.

# 3 నగరాల్లో ఫుడ్ స్ట్రీట్స్..

వరంగల్ : తెలంగాణలోని హన్మకొండ, నిజామాబాద్, మహబూబ్ నగర్ నగరాల ప్రజలకు గుడ్ న్యూస్. సాయంత్రం కుటుంబంతో కలిసి స్ట్రీడ్ ఫుడ్‌ను ఎంజాయ్ చేసేలా ఈ మూడు నగరాల్లో త్వరలోనే హెల్తీ అండ్ హైజినిక్ ఫుడ్ స్ట్రీట్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే దీని కోసం స్థలాల అన్వేషణ పూర్తి కాగా.. త్వరలోనే మిగతా ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ ఫుడ్ స్ట్రీట్లలో స్టాల్స్ ఏర్పాటు చేయాలని భావించే వారు ఫుడ్ సేఫ్టీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. చాలా మందికి స్ట్రీట్ ఫుడ్ అంటే ఇష్టం. సాయంత్రం అయితే చాలు బజ్జీలు, పునుగులు, పానీపూరీ.. ఇలా ఏదో ఒకటి లాగించకపోతే మనసు ఊరుకోదు. అయితే వాటిని తయారు చేయడానికి ఎలాంటి పదార్థాలు వాడుతున్నారు? వాటిని విక్రయించే ప్రదేశాల్లో పరిసరాలు శుభ్రంగా ఉంటాయో లేవో అనే భయం చాలా మందికి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ప్రజలకు హైజనిక్ స్ట్రీట్ ఫుడ్ అందేలా చూడటం కోసం కేంద్రం ప్రభుత్వం కీలక ప్రయత్నం చేస్తోంది. దేశవ్యాప్తంగా 100 హెల్తీ అండ్ హైజినిక్ ఫుడ్ స్ట్రీట్లను ఏర్పాటు చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటికే 86 సెంటర్లకు అనుమతులు ఇచ్చింది. నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా ఒక్కో సెంటర్ కోసం కోటి రూపాయలు చొప్పున నిధులు మంజూరు చేస్తోందిఈ క్రమంలోనే తెలంగాణలోని హనుమకొండ, నిజామాబాద్, మహబూబ్‌నగర్ నగరాల్లో హెల్తీ అండ్ హైజనిక్ ఫుడ్ స్ట్రీట్లను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఈ నగరాల్లో ఫుడ్ స్ట్రీట్ల ఏర్పాటుకు అనువైన స్థలాలను సైతం గుర్తించారు. సామాన్య ప్రజలు ఆహారం క్వాలిటీ గురించి, అందులో వాడిన పదార్థాల గురించి ఎలాంటి భయం లేకుండా.. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఫుడ్‌ను ఎంజాయ్ చేసేలా ఫుడ్ స్ట్రీట్స్ ఉంటాయి. దుమ్ము ధూళితో ఇబ్బంది లేకుండా చూడటం కోసం, సులభంగా శుభ్రం చేసేందుకు వీలుగా ఫుడ్ స్ట్రీట్స్ ప్రాంగణం మొత్తం టైల్స్ వేస్తారు. రాత్రి టైంలో



ఆకర్షణీయమైన లైటింగ్‌ను సైతం ఏర్పాటు చేయనున్నారు.

ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సర్టిఫికెట్ ఉన్న వారికి మాత్రమే ఫుడ్ స్ట్రీట్స్‌లో స్టాల్స్ కేటాయిస్తారు. ఈటూంఎ నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చూస్తారు. ఆహార పదార్థాలను ఎలా జాగ్రత్తపర్చాలి, పరిశుభ్రంగా ఎలాఉండాలనే విషయమై వెండర్లకు ట్రైనింగ్ కూడా ఇవ్వనున్నారు. ఈ స్టాల్స్‌లో వంట చేసే వారు, ఆహారాన్ని అందించేవారు తప్పనిసరిగా చేతులకు గ్లోవ్స్ పెట్టుకోవాలి. వెంట్రుకలు ఆహారంలో పడకుండా తలకు ఆప్రాన్ పెట్టుకోవాలి. గోర్లుపెంచుకోవడం, వేళ్లకుఉంగరాలు పెట్టుకోవడం కుదరదు. పొగాకు నమలడం, సిగరెట్లు, బీడీలు కాల్చడం నిషేధం. ఆహార పదార్థాల తయారీకి వాడే ముడిసరుకులతోపాటు, ఫుడ్ ఐటెమ్స్ క్వాలిటీని ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తారు.అంతే కాదు ఈ ఫుడ్ స్ట్రీట్స్‌లో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి కస్టమర్లు తాగడానికి శుద్ధ జలాన్నిఅందిస్తారు. చేతులు శుభ్రం చేసుకోవడానికి ప్రత్యేకంగా వాష్ ఏరియాలు ఉంటాయి. ఫ్యామిలీతో సరదాగా టైం గడుపుతూ, ఫుడ్‌ను ఎంజాయ్ చేయడం కోసం బెంచీలను ఏర్పాటు చేస్తారు.

# సంపన్నుల సంపద భయం!

'సంపద ఒక వైపు కేంద్రీకృతమయ్యే కొద్దీ మరోవైపు పేదరికం, అభద్రత, పేదరికం పెరుగుతాయి. ఈ ప్రక్రియ కార్మిక వర్గంలో అశాంతి, ఆగ్రహం, విప్లవ చైతన్యాన్ని పెంచుతుంది' కొన్ని వందల సంవత్సరాల క్రితం కారల్ మార్క్స్ చెప్పిన మాట ఇది! సరళీకరణ ఆర్థిక విధానల ఫలితంగా మన దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో ప్రస్తుతం పెరుగుతున్న అంతరాల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. శతకోటీశ్వరుల సంపద అనూహ్యంగా పెరుగు తుండగా, సామాన్యుల రోజువారీ జీవనం కూడా కష్టమవుతున్న పరిస్థితులు చూస్తున్నాం. ఈ పరిస్థితి సంపన్నుల్లో సైతం ఆందోళనకు దారి తీస్తోందా? కార్మికవర్గం జీవన భద్రతను కూడా కోల్పోతే తిరుగుబాటు అనివార్యమన్న మార్క్స్ చెప్పిన మాట వారిని భయపెడు తోందా? దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరైన కొందరు శతకోటీశ్వర్లు తమపై తక్షణమే సంపద పన్ను విధించాలం టూ వివిధ దేశాల ప్రభుత్వాలను కోరుతూ విడుదల చేసిన బహిరంగ లేఖ ఇటువంటి అనుమానాలనే కలిగిస్తోంది. 24 దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 400 మంది సంపన్నులు ఆ లేఖపై సంతకాలు చేశారు. అంతటితో ఆగకుండా 'టైమ్‌టు విన్ 'పేరిట ఒక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసి ప్రపంచవ్యాప్తంగా ఉన్న శతకోటీశ్వరు లను సంతకాలు చేయాలని కోరుతున్నారు. సంపద పన్నును విధించాలన్న డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోని విషయం తెలిసిందే. తాజాగా విడుదలైన లేఖపై సైతం మన దేశానికి చెందిన శత కోటీశ్వరులు ఎవ్వరూ సంతకాలు చేయకపోవడం గమనార్హం.'దావోస్‌కు హాజరైన మిత్రులారా మనందరికీ ఇది గెలిచే సమయం' అన్న పేరుతో ఈ లేఖ విడులైంది. 'అత్యంత




ధనికులు, మిగిలిన వారి మధ్య అంతరం రోజురోజుకి పెరుగుతోంది. పొరుగనే ఉన్న కాలనీల నుండి దేశాల వరకు ఈ చీలిక విస్తరించింది. ప్రపంచంలోని అత్యంత ధనికులపై ఒక్కశాతం మంది 95 శాతం మంది జనాభ వద్ద ఉన్న సంపద కన్నా ఎక్కువ పోగేసుకున్నారు. ఈ కొద్దిమంది ప్రజాస్వామ్యాలను కొనుగోలు చేశారు.

ప్రభుత్వాలను ఆధీనంలోకి తీసుకున్నారు. మీడియా గొంతు నొక్కారు. సాంకేతికత, ఆవిష్కరణలపై పట్టు సాధించారు. పేదరికం, సామాజిక వెలివేతను మరింతగా పెంచుతున్నారు. మా లాంటి కొద్ది మంది వద్ద పోగుపడుతున్న సంపద సమాజాన్ని ప్రమాదపు అంచున నిలిపిందన్న దానిలో సందేహమే లేదు. అధిక సంపద కొద్ది మందికి అతి నియంత్రణకు అవకాశం ఇచ్చింది. అది మన భద్రమైన భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతొంది. ఇప్పుడు ఆ నియంత్రణకు ముగింపు పలకాల్సిన సమయం వచ్చేసింది. అత్యంత ధనికులపైన అంటే మాపైన పన్ను వేయండి. ఇది ప్రజాస్వామ్యాన్ని తిరిగి పొందడానికి దోహద పడుతుంది.' అని లేఖలో వారు పేర్కొన్నారు.

# లోక్‌పాల్ తోనే రాజకీయ అవినీతికి అడ్డుకట్ట..!

అధికారంలో ఉన్నప్పుడు అవినీతికి తెగించడం..వేలకోట్లు సంపాదించడం.. అధికారం పోయాక, అధికారంలో ఉన్న పార్టీల అవినీతి గురించి ప్రశ్నించడం చూస్తున్నాం. అధికారంలో ఉన్న వారు, అధికారంలో ఉండి విపక్షం లోకి వచ్చిన వారు చేసిన అవినీతి వల్ల ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో కోలుకోలేని అప్పుల్లో కూరుకుని పోయాయి. ఇది వాస్తవం. విభజన వల్ల జరిగిన మేలు ఇదే. ఇందుకు నాలుగు పార్టీల నాయకులు బాధ్యులు. బిఆర్‌ఎస్‌గా మారిన టిఆర్‌ఎస్, కాంగ్రెస్, తెలుగుదేశం, వైకాపాలు ఈ అప్పులకు బాధ్యత వహించాలి. తెలుగు రాష్ట్రాల అప్పులను ఈ పార్టీల నుంచి వసూలు చేయాలి. అప్పుడే ఈ రెండు రాష్ట్రాలు అప్పుల ఊబినుండి బయటపడతాయి. ఇకపోతే నేతలకు సవాళ్లు విసురకోవడం అలవాటుగా మారింది. అధికారంలో ఉండగా తాము చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు, ఇప్పుడు అధికారంలో ఉన్న పార్టీలను నిందస్తున్నారు. ఇందులో ఎవ్వరేమీ తక్కువ తినలేదు. అందుకే రాజకీయ అవినీతిపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరగాలి. సాధారణ పోలీసులతో ఇది సాధ్యం కాదు. ప్రత్యేక వ్యవస్థను రూపొందించాలి. అన్నా హజారే కోరినట్లుగా లోక్‌పాల్ వ్యవస్థను తీసుకుని రావాలి. అప్పుడే స్వతంత్ర దర్యాప్తు కొనసాగుతుంది. అవినీతిపై నిగ్గు తేలుస్తారు. రాజీకయ పార్టీలు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలకు చట్టాలు తేవాలి. ప్రస్తుత సమాజంలో బాగా వేళ్లూనుకున్న అవినీతి ఎక్కడయినా ఉందంటే అది రాజకీయ పార్టీల్లోనే. పటిష్ట లోక్‌పాల్ వ్యవ్‌స్థ ద్వారానే అవినీతి నేతలను శిక్షించగలం. అందుకు ప్రజా ఉద్యమాలు రావాలి. ఆప్ ఉద్యమంలా కాకుండా ప్రజలు, మేధావులు కలసి ఉద్యమించాలి. ఇక తెలుగు రాష్ట్రాల విషయాలకు వస్తే జగన్, వైకాపా అవినీతిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కెసిఆర్, ఆయన కుటుంబం, బిఆర్‌ఎస్ నేతలఅవినీతిపైనా చర్యలు ముందుకు సాగడం లేదు. తాజాగా కాంగ్రెస్ అవినీతి బట్టబయలు అయ్యింది. ఈ క్రమంలో వీరి అవినీతిపై చర్యలు ఉంటాయనుకోవడం కూడా అత్యాశే అవుతుంది.

తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సిట్ తన దర్యాప్తును ముమ్మరం చేసింది. రెండేళ్లుగా సాలీడు దారంలా సాగుతోంది. ఇందులో భాగంగా తాజాగా మాజీ మంత్రి హరీష్‌రావును సిట్ అధికారులు 7 గంటలపాటు విచారించారు. సిట్ విచారణపై ఇప్పుడు బిఆర్‌ఎస్ నేతలు ఎదురుదాడికి దిగుతున్నారు. రేవంత్ రెడ్డి నీకు దమ్ముంటే నాకు నోటీసులు ఇవ్వడం కాదని, రాజకీయంగా కోట్లాడుదాం అని హరీష్ రావు సవాల్ విసిరారు. కాళేశ్వరం సహా అనేక అవినీతి కేసులు ఉన్నా ఆ పార్టీ నేతలు బరితెగించి మాట్లాడుతున్నారు. వారి అవినీతిని ప్రశ్నిస్తున్న అధికార కాంగ్రెస్ నేతలు తామూ అవినీతి బురదలో కూరుకు పోయారు. ఒక్కో మంత్రి మీద ఒక్కో అవినీతి బయటపడుతోంది. దీనినిబట్ట అవినీతి రాజకీయ పార్టీల హక్కుగా మారిందని అర్థం చేసుకోవాలి. ఫోన్ ట్యాపింగ్, ఈ కార్ రేసు, కాళేశ్వరం వంటివనీ పిచ్చకుంట్ల, లొట్టపీసు కేసులని బిఆర్‌ఎస్ వాదిస్తోంది. కాగ్రెస్ పై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర లోనే ఉన్నాయని హరీష్ రావు వ్యాఖ్యానించడం, ఆయన తప్పించుకునే రాజకీయ తెలివిని ప్రదర్శించారని గుర్తించాలి. ఇకపోతే సింగరేణి సంస్థ నిబంధనలు మార్చి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన బావమరిదికి రూ. 1,600 కోట్ల టెండర్లు కట్టబెట్టారని బిఆర్‌ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. బొగ్గు కుంభకోణంపై నిగ్గు తేల్చడం కోసం సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కార్ అనేక కుంభకోణాలకు పాల్పడిందని, రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని మండిపడ్డారు. మంత్రుల వద్ద వాటాల పంచాయితీ నడుస్తున్నదని దుయ్యబట్టారు. గతంలో సింగరేణిపై ఏ ప్రభుత్వం కూడా అజమాయిషి చేయలేదని, కానీ, రేవంత్ సర్కార్ మాత్రం అజమాయిషీ చేస్తూ, తద్వారా సంస్థను నిర్వీర్యం చేస్తున్నదని దుయ్యబట్టారు. మొత్తానికి వజ్రాన్ని వజ్రంతోనే కోయాలని అంటారు. అవినీతి ఆరోపణలను అవినీతి ఆరోపణలతో తిప్పికొట్టడం ఇప్పుడు రాజకీయ పార్టీలకు అలవాటుగా మారింది.

# మిర్చి ధర పైపైకి..

**ఒక్కరోజే రూ.2,400 చొప్పున పెరిగిన ధర**

**సరుకు పెరిగినా ఇదే ధర ఉండాలని కోరుకుంటున్న రైతులు**



రఘునాథపాలెం,: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ధర పైపైకి వెళ్తున్నది.తో పోల్చితే ఒక్క రోజులోనే భారీగా ధర పెరిగింది. ఈ ఏడాది ఇదే అధిక పెరుగుదల అని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. క్వింటా ఏసీ మిర్చి ధర రూ.20,200, కొత్త మిర్చి ధర రూ.20 వేలకు చేరింది. దీంతో పంట విక్రయానికి తరలించిన రైతుల్లో ఆశలు చిగురించాయి. వారం రోజుల క్రితం వరకు పోల్చితే మిర్చి ధరకేవలం రూ.15 వేలకే పరిమితమైంది. అయితే రెండు రోజులుగా వరుసగా పెరుగుతూ వచ్చిన మిర్చి ధర బుధవారం నాటికి రూ.20 వేల మార్క్‌ను చేరింది. వ్యవసాయ మార్కెట్‌కు కొత్త మిర్చి భారీగా వస్తుండడంతో ధరలో పురోగతి కనిపిస్తున్నది. 2024లో మిర్చి క్వింటా ధర రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు పలికింది. రెండేళ్లుగా తెలంగాణ మిర్చికి విదేశాల్లో డిమాండ్ లేకపోవడంతో ధర భారీగా పడిపోయింది. కాగా, ఈ ఏడాది తెగుళ్లు, అధిక వర్షాల కారణంగా దిగుబడులు పూర్తిగా తగ్గాయి. ఏటా లక్ష ఎకరాల్లో సాగయ్యే మిర్చి.. ఈ ఏడాది కేవలం 40 వేల ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. ఈ క్రమంలో దిగుబడులు తగ్గడంతో విదేశీ మార్కెట్‌లో మిర్చికి డిమాండ్ పెరిగింది. కాగా, బుధవారం ఖమ్మం మార్కెట్‌కు 13 వేల బస్తాలు వచ్చినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. సీజన్‌లో మార్కెట్‌కు వచ్చే సరుకు పెరిగినప్పటికీ ఇదే ధర నిలకడగా ఉండాలని రైతులు కోరుతున్నారు.


# సామ్రాజ్యవాద పెనుముప్పు

అమెరికా సామ్రాజ్యవాదం బుసలుకొడుతోంది. నిన్న వెనిజులాపై ఆకస్మిక దాడి చేసి, వందలాదిమందిని హత్య చేసి, అధ్యక్షుడు మదురోను, ఆయన భార్యను అర్ధరాత్రి వేళ సైనిక విమానంలో ఎత్తుకెళ్లడం, నేడు గ్రీన్‌లాండ్స్‌ను కబళించేందుకు సిద్ధం కావడం, ఇరాన్, క్యూబా, మెక్సికో, కొలంబియా లాంటి దేశాలపై బెదిరింపులకు దిగడం× ఇవన్నీ సామ్రాజ్యవాద వికృతరూపానికి ఆనవాళ్లు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూకుడుతో పాటు అగ్రరాజ్య దురహంకారానికి ప్రతిరూపాలే.

ప్రస్తుతం గ్రీన్‌లాండ్‌పై యుద్ధ మేఘాలు ఆవరించాయి. ఆ ద్వీపంలోని కీలక సైనిక స్థావరం పిటుఫిక్ స్పేస్ బేస్‌కు సైనిక విమానం పంపుతున్నట్టు ఇప్పటికే అమెరికా ప్రకటించింది. ప్రపంచంలోనే అతి పెద్దదైన ఈ దీవిలో అత్యంత అరుదైనవిగా ప్రకటించిన 34 ఖనిజాల్లో గ్రాఫైట్, లిథియం వంటి 25 ఖనిజాలు అపారంగా ఇక్కడ ఉన్నాయి. విద్యుత్ వాహనాల తయారీలో చాలా కీలకమైన వీటిని, చమురు, సహజ వాయువును వెలికితీస్తే పర్యావరణానికి ముప్పేనన్న స్పృహతో అక్కడి ప్రభుత్వం 2019 నుంచి నిషేధం విధించింది. వీటన్నింటినీ చేజిక్కించుకునేందుకే రష్యా, చైనా బూచి చూపడం సహా ట్రంప్ వాచాలత. అభ్యంతరం చెప్పిన యూరోపియన్ యూని యన్ దేశాలపై వచ్చే నెల 1 నుంచి 10 శాతం సుంకాలు విధిస్తాననడం కయ్యానికి కాలుదువ్వడమే!

గాజా పునర్నిర్మాణం కోసమంటూ తాను శాశ్వత అధ్యక్షుడిగా శాంతి మండలి ఏర్పాటు చేస్తాననడం, దానికి మనదేశం సహా 60 దేశాలను ఆహ్వానించడం మరో ప్రమాదక ర పోకడ. తలా తోకా లేకుండా ఐక్యరాజ్య సమితిని నిర్వీర్యం చేసేలా ఉన్న ఈ ఎత్తుగడ గాజా వాసులకు సహాయం అందకుండా చేసి తరిమేయడానికి, జాతి నిర్మూలనకు, ఆ ఆనవాళ్లు చెరిపేయడానికే.

మెరికా ఆంక్షలతో ఇరాన్, రష్యా, వెనిజులా తదితర దేశాలు వివిధ కరెన్సీల్లో చమురు అమ్మకాలు జరపడంతో డాలర్ ఆధిపత్యానికి కొంతమేర గండిపడటం, వాణిజ్యలోటు అంతకంతకూ పెరిగిపోతుండటం, ప్రపంచంలోనే అతిపెద్ద రుణగ్రస్థ దేశంగా కొనసాగుతుండటం లాంటి సవాళ్లను అధిగమించడానికి అగ్రరాజ్యం




విధ్వంసకర ఎత్తుగడలకు పూనుకోవడం గర్హనీయం. ఒకప్పుడు తన వలసలుగా ఉన్న దేశాల్లోని సంపదనంతా తరలించుకుపోయిన బ్రిటీష్ సామ్రాజ్యవాదుల తరహాలోనే ప్రపంచంపై పెత్తనం చేయాలనుకోవడం ఆందోళనకరం. దిగుమతులపై అధిక సుంకాలు విధించడం, చమురు, సహజవాయువు లాంటి ఇంధనాలను నిల్వవుంచుకునే పద్ధతికి భిన్నంగా అమ్మకాలు జరపడం, విలువైన వనరులున్న దేశాలను నయా వలసలుగా చేసుకుని, వాటిని కొల్లగొట్టడం, ఇజ్రాయిల్ ద్వారా మధ్యప్రాచ్యమంతటా మంటలు రాజేయడం, వెనిజులాకు తానే అధ్యక్షుడినని ట్రంప్ ప్రకటించుకోవడం, ఇరాన్‌లో పాలకులను మార్చేస్తాననడం, క్యూబాకు అమెరికా విదేశాంగ మంత్రి అధ్యక్షుడు అవుతాడనడం ఇవన్నీ అందులో భాగమే. ఒకప్పుడు సామ్రాజ్యవాద దురహంకారాన్ని నిలువరించిన సోవియట్ యూనియన్‌లా బలమైన సోషలిస్టు శిబిరం లేకపోవడంతో అమెరికా ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. లాటిన్ అమెరికాకో, ఇయుకో పరిమితమవుతుందనుకుని చేష్టలుడిగి కూర్చుంటే× మూడో ప్రపంచ దేశాలకూ యుద్ధ మేఘాలు విస్తరించే ప్రమాదం పొంచివుంది. ఎన్ని మాటలన్నా, సరైన పత్రాల్లేవంటూ ప్రవాస భారతీయులను సంకెళ్లు వేసి, గొలుసులతో బంధించి అవమానకరంగా యుద్ధ విమానాల్లో తరలించినా, ఎడాపెడా సుంకాలు విధించి దేశానికి తీరని నష్టం కలిగిస్తున్నా, నిత్యం బెదిరింపులకు పాల్పడుతున్నా మన పాలకులు నోరుమెదపక పోవడం సిగ్గుచేటు. అమెరికా దురహంకార, ఆధిపత్య చర్యలను ఇకనైనా భారత్ ప్రతిఘటించాలి. అంతర్జాతీయ న్యాయ సూత్రాలను, దేశాల స్వాతం(త్యాన్ని కాలరాస్తూ ప్రపంచాన్ని పెనువిపత్తు దిశగా తీసుకె ళ్తున్న సామ్రాజ్యవాద దురహంకారాన్ని తుదముట్టించడం అత్యావశ్యకం. అందుకు భిన్నంగా వ్యవహరించిన దేశాలను, పాలకులను భవిష్యత్ తరాలు, చరిత్ర క్షమించవు.

# సినిమా



# రజనీకాంత్ బయోపిక్ రెడీ..



కోలీవుడ్ సూపర్ స్టార్ రజనీకాంత్ అంటే ఉండే క్రేజ్ గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పని లేదు. ఆయన వాకింగ్ స్టైల్, డ్యాన్స్‌కే కోట్లాది మంది అభిమానులు ఫిదా అయ్యారు. బస్ కండక్టర్ స్థాయి నుంచి స్టార్‌గా ఎదిగిన ఆయన ప్రయాణం ఇండస్ట్రీలో ఎందరికో స్ఫూర్తి. ఆయన బయోపిక్ సిల్వర్ స్క్రీన్‌పై రానుందంటూ ఎప్పటి నుంచో ప్రచారం సాగుతోంది. తాజాగా దీనిపై ఆయన కుమార్తె ఐశ్వర్య ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. రజనీ కాంత్ బయోపిక్‌పై తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఐశ్వర్య ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్ చెప్పారు. తన తండ్రి ఆటో బయోగ్రఫీ వర్క్ ఇప్పటికే ప్రారంభం అయినట్లు తెలిపారు. ఇది రిలీజ్ అయ్యాక వరల్డ్ వైడ్‌గా ఓ సెన్సేషన్ అవుతుందని అన్నారు. దీంతో అభిమానుల్లో ఓ కొత్త ఉత్సాహం నెలకొంది. అయితే, ఈ బయోపిక్‌లో ఎవరెవరు నటిస్తున్నారు? ఎవరు డైరెక్ట్ చేయబోతున్నారు? అనే వివరాలు తెలియాల్సి ఉంది. త్వరలోనే దీనిపై క్లారిటీ వచ్చే ఛాన్స్ ఉంది. ఇండస్ట్రీలో ఏఐ వినియోగం మంచిదే అయినా అది ఎప్పటికైనా కృత్రిమమే అనేది గుర్తించుకోవాలన్నారు ఐశ్వర్య. అధునాతన టెక్నాలజీ సాయంతో 'కొచ్చాడయాన్ (2014)' వంటి విజువల్ వండర్ తెరకెక్కించగలిగామని చెప్పారు. వీలైతే భవిష్యత్తులో అలాంటి మూవీస్ తీయడం తనకు ఇష్టమని అన్నారు.

'3', 'లాల్ సలామ్' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించిన ఐశ్వర్య... 'విత్ లవ్' అనే మూవీకి నిర్మాతగా వ్యవహరించారు. ఈ మూవీలో 'టూరిస్ట్ ఫ్యామిలీ' డైరెక్టర్ అభిషన్ జీవింత్ హీరోగా నటించగా... మదన్ దర్శకత్వం వహించారు. 'ఛాంపియన్' ఫేం అనస్వర రాజన్ హీరోయిన్‌గా నటించారు. ఫిబ్రవరి 6న సినిమా తెలుగులోనూ రిలీజ్ కానుంది. అటు, రజనీకాంత్ ప్రస్తుతం 'జైలర్ 2'తో బిజీగా ఉండగా జూన్ 12న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ భారీ యాక్షన్ ఎంటర్టైనర్‌ను సన్ పిక్చర్స్ నిర్మిస్తోంది.

# తమన్నా, పూజా హెగ్డే. మధ్య పోటీ!



సినీ రంగం లో తమన్నా, పూజ హెగ్డే లకు ఉన్న క్రేజ్ ఎలాంటిదో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ప్రతీ ఏటా ఎంతో మంది యంగ్ హీరోయిన్లు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టొచ్చు, కానీ వీళ్లిద్దరి క్రేజ్ మాత్రం ఇసుమంత కూడా తగ్గలేదు. హిట్, ఫ్లాప్ లతో సంబంధం లేకుండా, వరుసగా సినిమాలు చేస్తూ దూసుకెళ్తున్నారు ఈ ఇద్దరు హీరోయిన్స్. అయితే వీళ్లకు ఏ మాత్రం సంబంధం లేని రాజకీయాలు, ఇప్పుడు వీళ్లిద్దరు చుట్టూ తిరుగుతున్నాయి. పూర్తి వివరాల్లోకి వెళ్తే కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యం లో ఉండే మైసూర్ శాండిల్ సోప్‌కి బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరించేందుకు తమన్నాని ఎంపిక చేశారు. ఒకప్పుడు దేశవ్యాప్తంగా మైసూర్ శాండిల్ సోప్స్ కి ఉన్న క్రేజ్ మామూలుది కాదు. ఈమధ్య కొత్త ప్రొడక్ట్స్‌కారణంగా ఈ బ్రాండ్ కి కాస్త క్రేజ్ తగ్గింది. అందుకే ప్రభుత్వం ఈసోప్‌ను రీ బ్రాండింగ్ చేస్తూ, నేడు లాంచింగ్ కార్యక్రమాన్ని నిర్వహించింది. అయితే ఈ బ్రాండ్ కి తమన్నా ని ఎంపిక చేయడం పై ప్రతిపక్ష పార్టీలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నాయి.

కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఎంతో మంది హీరోయిన్లు ఉన్నారు, వాళ్ళని బ్రాండ్ అంబాసిడర్ గా ఎంచుకోవచ్చు కదా, ఎందుకు తమన్నా ని ప్రత్యేకించి తీసుకున్నారు. కర్ణాటక లో పుట్టిన పెరిగిన పూజా హెగ్డే ని ఎందుకు ఎంచుకోలేదు?, ఆమెతో పాటు రష్మిక మందాన,రుక్మిణి వాసంత్, శ్రీనిధి శెట్టి వంటి పాన్ ఇండియన్ స్టార్ హీరోయిన్లందరూ కర్ణాటక రాష్ట్రానికి చెందిన వారే. క్రేజ్, ఫాలోయింగ్, ఫేమ్ విషయంలో వీళ్ళు తమన్నా కి ఏ మాత్రం తీసిపోరు. అయినప్పటికీ వీళ్ళలో ఎవరో ఒకరిని ప్రభుత్వం ఎందుకు ఎంచుకోలేదు అంటూ నిలదీస్తున్నారు. ప్రతి పక్ష పార్టీ కి చెందిన నేతలు. బీజేపీ పార్టీ నాయకులూ కూడా ఈ విషయం లో ప్రభుత్వాన్ని తీవ్ర స్థాయిలో తప్పుబడుతున్నారు. స్థానిక తారలను విస్మరించడం స్థానిక కాంగ్రెస్ నేత కన్నడ వ్యతిరేక మనస్తత్వానికి నిదర్శమని అంటున్నారు. అలా తమన్నా, పూజా హెగ్డే , రష్మిక వంటి హీరోయిన్ల పేర్లు రాజకీయాలకు ఏ మాత్రం సంబంధం లేకపోయినా అక్కడి నేతలు తీస్తున్నారు. అయితే కర్ణాటక ప్రభుత్వం మాత్రం ఈ విమర్శలను లెక్క చేయడం లేదు, వాళ్లకు చేయాలనుకున్న పనులు చేస్తూ ముందుకెళ్తున్నారు.



# 'ఫౌజీ'తో యాక్షన్‌కు రెడీ..



రెబల్ స్టార్ కృష్ణంరాజు నట వారసుడిగా సినీ పరిశ్రమలో అడుగుపెట్టి, ప్రస్తుతం భారతదేశంలోనే అతిపెద్ద సూపర్‌స్టార్లలో ఒకరిగా ఎదిగారు ప్రభాస్. ఇప్పుడు వరుస పాన్ ఇండియా చిత్రాలతో అభిమానుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. భారీ బడ్జెట్ సినిమాలు, దేశవ్యాప్త విడుదలలు, అంతర్జాతీయ మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకున్న కథలతో ఆయన రేంజ్ మరింత పెరుగుతోంది. సినిమా ఫలితాలతో సంబంధం లేకుండా వందల కోట్ల వసూళ్లు సాధించడం ప్రభాస్ ప్రత్యేకతగా ట్రేడ్ వర్గాలు చెబుతుంటాయి. ఇలాంటి సమయంలో ఆయన నటిస్తున్న తాజా చిత్రం ఫౌజీ షూటింగ్‌లో స్వల్ప ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. గుర్రపు స్వారీ సన్నివేశం చిత్రీకరణ సమయంలో ప్రభాస్ కింద పడిపోవడంతో చేతులకు చిన్న గాయాలు అయినట్లు సినీ వర్గాలు వెల్లడించాయి. చిత్రబృందం వెంటనే స్పందించి ప్రథమ చికిత్స అందించగా, గాయాలు తీవ్రంగా లేవని తెలిసింది. వైద్యులు ఒకటి రెండు రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ప్రభాస్ సురక్షితంగానే ఉన్నారని, త్వరలోనే మళ్లీ షూటింగ్‌లో పాల్గొననున్నారని యూనిట్ తెలిపింది. ఈ వార్తతో అభిమానులు తొలుత ఆందోళన చెందగా, గాయాలు చిన్నవేనని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. 'ఫౌజీ' చిత్రానికి హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. గతంలో సీతారామంతో ప్రశంసలు అందుకున్న ఆయన, ఈసారి మరింత ఎమోషన్‌తో కూడిన యాక్షన్ డ్రామాను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారని టాక్. ఈ సినిమాలో ప్రభాస్ బ్రిటిష్ సైనికుడి పాత్రలో కనిపించనున్నారని సమాచారం. దేశభక్తి, ప్రేమ, త్యాగం వంటి అంశాలతో కథ నడుస్తుందని తెలుస్తోంది. గుర్రపు స్వారీతో కూడిన హై వోల్టేజ్ చేజింగ్ సన్నివేశం సినిమాకే హైలైట్‌గా నిలవనుందని, భారీ సెట్స్ మరియు విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ సన్నివేశాలను రూపొందిస్తున్నారని చిత్ర యూనిట్ చెబుతోంది. ఈ చిత్రంలో ఇమాన్వీ ఇస్మాయిల్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇదిలా ఉండగా ప్రభాస్ తదుపరి చిత్రం స్పిరిట్‌పై కూడా భారీ అంచనాలే ఉన్నాయి. ఈ చిత్రానికి సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తుండగా, పోలీస్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. హీరోయిన్‌గా త్రిప్తి దిమ్రీ నటిస్తుండగా, టి-సిరీస్ నిర్మిస్తోంది. ఇప్పటికే విడుదల తేదీని ప్రకటించగా, ఈ చిత్రం వచ్చే ఏడాదిమార్చి 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల ది రాజా సాబ్‌తో ఆశించిన ఫలితంఅందుకోలేకపోయిన ప్రభాస్‌చేతిలో ప్రస్తు తం ఫౌజీ, స్పిరిట్‌తో పాటు సలార్ 2, కల్కి 2 వంటి భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ వరుస చిత్రాలతో ప్రభాస్ రేంజ్ మరింత పెరగడం ఖాయమనే అభిప్రాయం సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# వారణాసిలో శివభక్తుడిగా ప్రకాశ్ రాజ్



భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి'పై రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా, దర్శకధీరుడు ఎస్. ఎస్. రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం పాన్ వరల్డ్ స్థాయిలో విడుదలకు సిద్ధమవుతోంది. ఇప్పటి వరకు సినిమా విషయాలపై గోప్యత పాటించిన రాజమౌళి, ఇటీవల ఒక్కో అప్డేట్‌ను బయట పెడుతూ అభిమానుల్లో హైప్‌ను మరింత పెంచుతున్నారు. ఈ సినిమాలో మహేష్ బాబు 'రుద్ర' అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపిం చనుండగా, బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ప్రియాంక చోప్రా 'మందాకిని' పాత్రలో నటిస్తోంది. మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ 'కుంభ'పాత్రలో కనిపించనున్నాడు. ఈ ముగ్గురు ప్రధాన పాత్రల ఫస్ట్ లుక్స్‌ను ఇప్పటికే చిత్రబృందం విడుదల చేయగా, టైటిల్ టీజర్ ద్వారా 'వారణాసి వరల్డ్' ఎలా ఉండబోతుందో ఒక విజువల్ శాంపిల్‌ను చూపించారు. ఓ హాలీవుడ్ ఇంటర్వ్యూలో రాజమౌళి సినిమా జానర్, కథ నేపథ్యంపై స్వల్ప హింట్స్ కూడా ఇచ్చారు. ఇదిలా ఉండగా, ఈ చిత్రంలో రామాయణానికి సంబంధించిన ఓ ఎపిసోడ్ కూడా ఉండబోతుందని రాజమౌళి స్వయంగా వెల్లడించారు. కొన్ని నిమిషాల పాటు మహేష్ బాబు శ్రీరాముడి పాత్రలో కనిపించనున్నట్లు తెలిపారు. ఆ ఎపిసోడ్ షూటింగ్ ఇప్పటికే పూర్తయ్యిందని, ప్రస్తుతం వీఎఫ్ఎక్స్ పనులు జరుగుతున్నాయని సమాచారం. ఈ అంశం సినిమా మీద అంచనాలను మరింత పెంచింది. ఇక తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన మరో ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ ఈ సినిమాలో నటిస్తున్న విషయం కొంతకాలం క్రితమే వెల్లడించగా, ఇప్పుడు తన పాత్రను కూడా స్వయంగా బయటపెట్టారు. ఇటీవల ఓ న్యూస్ ఛానల్ డిబేట్‌లో పాల్గొన్న ఆయన, 'వారణాసి' చిత్రంలో తాను మహా శివభక్తుడి పాత్ర పోషిస్తున్నానని తెలిపారు. ఈ పాత్ర తన నటనా జీవితంలో మరో ప్రత్యేకమైన మైలురాయిగా నిలుస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రకాశ్ రాజ్ గతంలో రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన 'విక్రమార్కుడు' చిత్రంలో నటించారు. అలాగే మహేష్ బాబుతో 'రాజకుమారుడు' నుంచి 'గుంటూరు కారం' వరకు అనేక హిట్ చిత్రాల్లో కలిసి నటించారు. వీరిద్దరి కాంబినేషన్‌కు ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన ఆదరణ ఉంది. గతంలో 'ఢమరుకం' చిత్రంలో శివుడి పాత్రలో కనిపించిన ప్రకాశ్ రాజ్, ఇప్పుడు శివభక్తుడిగా నటించడంవిశేషం. ప్రస్తుతం 'వారణాసి' తదుపరి షెడ్యూల్‌కు చిత్ర బృందం సిద్ధమవుతోంది. విజువల్ గ్రాండియర్, మైథాలజీ ఎలిమెంట్స్, యాక్షన్ అడ్వెంచర్ మేళవింపుతో రూపొందుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది సమ్మర్ సీజన్‌లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. అభిమానులు మాత్రం ఈ సినిమాను భారతీయ సినిమా గర్వంగా నిలిచే ప్రాజెక్ట్‌గా భావిస్తూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# అప్పలసూరిగా జగపతిబాబు



ఒకప్పటి ఫ్యామిలీ హీరో, ప్రస్తుతం స్టార్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా దూసుకుపోతున్న జగపతి బాబు తాజాగా తన లుక్‌తో అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమా కోసం ఆయన పూర్తిగా మారిపోయిన కొత్త రూపం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఫోటోను చూసిన నెటిజన్లు ఇతను జగపతి బాబా అంటున్నారు. ఈ చిత్రంలో జగపతి బాబు 'అప్పల సూరి' అనే కీలక పాత్రలో నటిస్తున్నట్లు ఇప్పటికే చిత్రబృందం ప్రకటించింది. ఆ పాత్ర కోసం ఆయన బాగా బరువు తగ్గి, వయసు ముదిరిన వ్యక్తిలా కనిపించేలా ప్రత్యేక మేకోవర్ తీసుకున్నట్టు తెలుస్తోంది. తాజాగా విడుదలైన సెట్స్ ఫోటోలో దర్శకుడు బుచ్చిబాబుతో మాట్లాడుతున్న జగపతి బాబు రూపంచూసి అభిమానులు షాక్ అవుతున్నారు. ఏ కోణంలో చూసినా ఆయన గుర్తుపట్టలేనంతగా మారిపోయారని పలువురు అభిప్రాయపడుతున్నారు. జగపతి బాబు బర్త్ డే సందర్భంగా ఈ పిక్ రిలీజ్ చేశారు మేకర్స్. గతంలో కూడా జగ్గూ భాయ్‌కి సంబంధించిన పిక్ ఒకటి షేర్ చేయగా, అది కూడా నెట్టింట వైరల్ అయింది. ఇకజగపతి బాబు గతంలో కూడా పాత్ర కోసంతన లుక్‌ను పూర్తిగా మార్చుకున్న సందర్భాలు ఉన్నాయి. అయితే ఈసారి 'పెద్ది' కోసం తీసుకున్న మేకోవర్ మాత్రం మరింత విభిన్నంగా ఉండటంతో సినిమాపై ఆసక్తి పెరిగింది. ఒకప్పుడు హీరోగా మెప్పించిన ఆయన, తర్వాత విలన్ మరియు క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించి వరుస విజయాలతో తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఇక రామ్ చరణ్ – జగపతి బాబు కాంబినేషన్ ఇప్పటికే 'రంగస్థలం' చిత్రంలో ప్రేక్షకులను ఆకట్టుకున్న విషయం తెలిసిందే.

Printer, Published and Owned by AMBATI PUBLICATIONS at H.No. 8-3-214, Mallikarjun Nagar, Godavarikhani, Dist. Peddapalli. Telangana State - 505 209.“
Printers : Ganesh Offset Printers, Godavarikhani. Editor: P. Ramakrishna, RNI No. TELTEL/2021/02031, email : yadavpolaveni123456@gmail.com, Mobile : 7396644411